# వ్యాపారవేత్త ఆలోచనా ధోరణితో మహిళలు ముందుకు సాగాలి



3

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్
శుక్రవారం 21 మార్చి 2025 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ

# 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంస్కరణతో దేశం మరింత బలోపేతం

- భారతదేశ భవిష్యత్తును మార్చే ఒక శక్తివంతమైన ఆలోచన
- ఆర్థిక లాభాలు దీర్ఘకాలిక ప్రయోజనాలు పెరుగుతాయి
- అధికారులు ఎన్నికల నిర్వహణలో కాకుండా, అభివృద్ధి పనులపై దృష్టి పెడతారు
- ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులపై దృష్టి
- బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే సంస్కరణ భారతదేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే, దేశ ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించే, అభివృద్ధి పనులను వేగవంతం చేసే ఒక గొప్ప అడుగు అని బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు ఖమ్మం నగరం లో వీడియోస్ కాలనీ రామాలయం ప్రాంగణంలో"వన్ నేషన్ వన్ ఎలక్షన్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "సమ్మానిత బిజెపి కార్యకర్తలు, ఈ రోజు మనం ఇక్కడ ఒక గొప్ప లక్ష్యం కోసం, ఒక విప్లవాత్మక సంస్కరణ కోసం సమావేశమయ్యాము. అదే 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'. ఈ సంస్కరణ భారతదేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే, దేశ ఆర్థిక వనరులను మిగతా 2లో..



## ఉగాది నుంచి ఆడబిడ్డలకు సన్నబియ్యం

- పెనుబల్లి మండలం పర్యటనలో మంత్రి పొంగులేటి
- రామ చంద్రపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన
- కల్లూరులోనూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

4



## ధర్మ రక్షణ కోసం నిరంతర కృషి

- పనిచేసే వారికే పదవులు
- కాషాయ జెండా గడపగడపకు
- స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



## సీపీఐ(ఎం) పోరాట ఫలితమే 'సీతారామ'

- ఎత్తిపోతల పథకంపై చిన్నచూపు
- బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు
- తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం
- బడ్జెట్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయం అన్నీ నిర్లక్ష్యమే..!
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా



5

## బీసీ రిజర్వేషన్ బిల్లు ఎస్సీ వర్గీకరణ బిల్లు రాజీవ్ యువ వికాసం విజయోత్సవ సంబరాలు




**కెరటం న్యూస్ న్యూస్ ప్రతినిధి కారేపల్లి**

బీసీ రిజర్వేషన్ బిల్లు ఎస్సీ వర్గీకరణ బిల్లు రాజీవ్ ఇవ్వ వికాసం విజయోత్సవ సంబరాలు కారేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, రాష్ట్ర నాయకులు, పగడాల మంజుల, టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు బోల్ల రమేష్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, సురేందర్ మణియార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేదరి టోనీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్, గడ్డమీద రామారావు, హనీఫ్, అదేర్ల రాములు, హర్షనాయక్, కురసం సత్యనారాయణ, స్వామి, నాగరాజు, దేగల ఉపేందర్, కబీర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ





**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

ఖమ్మం ఎన్ఎస్పి గట్టయ్య సెంటర్ రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం రోటరీ సర్వీస్ సెంటర్ లో 60 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేయడం జరిగింది. దీనికి అమెరికాలోనే ఏకం సంస్థ వారు 2,61,000 వేల రూపాయలను సహాయంగా అందించారు. కృత్రిమ పాదాలతో పాటు బూట్లు కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవి మల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు , మహేశ్వరి గోల్డ్ అధినేత అరవపల్లి అశోక్ పాల్గొని రోటరీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు నల్లమోతు రవీంద్రనాథ్, కార్యదర్శి దొడ్డపనేని సాంబశివరావు, కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు, ఏ జి భూషణ్ రావు, మేకల బిక్షమయ్య, నాగేశ్వరావు, సుధాకర్, ముత్తయ్య తదితరులు హాజరయ్యారు.

# 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంస్కరణతో దేశం మరింత బలోపేతం

(మొదటిపేజీ తరువాయి..)

సమర్థవంతంగా వినియోగించే, అభివృద్ధి పనులను వేగవంతం చేసే ఒక గొప్ప అడుగు.ఎందుకు "వన్ నేషన్ వన్ ఎలక్షన్"?మన దేశం ఒక అద్భుతమైన ప్రజాస్వామ్య వ్యవస్థను కలిగి ఉంది. ఇక్కడ ఎన్నికలు ఒక పండుగలా జరుగుతాయి. కానీ, ఈ ఎన్నికలు తరచూ జరగడం వల్ల ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రతి రెండు, మూడు సంవత్సరాలకు ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల నిర్వహణలోనే నిమగ్నమై, అభివృద్ధి పనులు వెనకబడిపోతున్నాయి. ఆర్థిక వనరులు వృథా అవుతున్నాయి. పరిపాలనా సామర్థ్యం దెబ్బతింటోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ఒక ఆదర్శవంతమైన పరిష్కారం.మీరు గమనిస్తే, ఒక లోక్‌సభ ఎన్నికలకు సుమారు 4,500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. ఒక్కో రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు వేల కోట్ల రూపాయలు వెచ్చించబడతాయి. ఈ ఖర్చును ఒకేసారి ఎన్నికల ద్వారా సగానికి తగ్గించవచ్చు. ఆదా అయిన ఈ డబ్బును మనం ఏ విధంగా ఉపయోగించవచ్చో ఆలోచించండి అని వివరించారు. గ్రామీణ రోడ్లను బాగు చేయవచ్చు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించవచ్చు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించవచ్చు. రైతులకు సాగునీటి సౌకర్యాలు అందించవచ్చు. ఇవన్నీ సాధ్యమవుతాయి అన్నారు. కానీ, ఎన్నికలు తరచూ జరగడం వల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ కార్యకలాపాల్లో మునిగిపోతారు. దీనివల్ల స్థానిక సమస్యలు విస్మరించబడతాయి. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అమలైతే, ఎన్నికల ఒత్తిడి తగ్గుతుంది. ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులపై దృష్టి కేంద్రీకరించగలదు. మనం ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ సంస్కరణ కేవలం రాజకీయ ఎజెండా కాదు. ఇది దేశ ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచే, వారి భవిష్యత్తును సురక్షితం చేసే ఒక గొప్ప ఆలోచన. మన ఖమ్మం ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే, రైతులు సంతోషంగా ఉండాలంటే, ఈ సంస్కరణ ఒక



కీలకమైన అడుగు. ఎన్నికల కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయే ప్రాజెక్టులు, పూర్తి కాని సాగునీటి పథకాలు ఇకపై ఉండవు. ప్రభుత్వం స్థిరంగా, నిరంతరంగా పనిచేయగలదు.ఆర్థిక లాభాలు , దీర్ఘకాలిక ప్రయోజనాలుఇప్పుడు కొంత లెక్కల గురించి మాట్లాడదాం. ఒక లోక్‌సభ ఎన్నికలకు 4,500 కోట్లు ఖర్చవుతాయని చెప్పాను. దేశంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఒక్కో రాష్ట్ర ఎన్నికలకు సగటున 500 కోట్లు ఖర్చవుతాయని అనుకుందాం. ఐదేళ్లలో ఈ ఖర్చు ఎంతో లెక్కించండి. సుమారు 18,000 కోట్ల రూపాయలు! ఇది కేవలం ప్రభుత్వ ఖర్చు మాత్రమే. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వెచ్చించే డబ్బు ఇందులో కలపలేదు. ఈ భారీ మొత్తాన్ని ఒకేసారి ఎన్నికల ద్వారా సగానికి తగ్గించవచ్చు. ఆదా అయిన ప్రతి రూపాయి మన దేశ ప్రజల సంక్షేమం కోసం వినియోగించబడుతుంది.ఈ సంస్కరణ దీర్ఘకాలిక ప్రయోజనాలు కూడా అనేకం. పరిపాలనా సామర్థ్యం పెరుగుతుంది. అధికారులు ఎన్నికల నిర్వహణలో కాకుండా, అభివృద్ధి పనులపై దృష్టి పెడతారు. రాజకీయ అస్థిరత తగ్గుతుంది. ప్రజలు తమ ప్రతినిధులను ఐదేళ్ల పాటు పనిచేయనివ్వగలరు. ఇది ఒక స్థిరమైన, బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మిస్తుందని చెప్పుకొచ్చారు. చరిత్రలో ఈ విధానంతే సంస్కరణ కొత్తది కాదని మీకు తెలుసా? 1950లలో మన దేశంలో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరిగేవి. 1951-52, 1957, 1962లో ఈ విధానం విజయవంతంగా అమలైంది. కానీ, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కూలడం, మధ్యంతర ఎన్నికలు జరగడం వల్ల ఈ వ్యవస్థ ఆగిపోయింది. ఇప్పుడు మనం ఈ చారిత్రక విధానాన్ని మళ్లీ పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇది మన చరిత్రలో విజయవంతమైన విధానం. దీన్ని మళ్లీ అమలు

చేయడం ద్వారా మనం భవిష్యత్తును సురక్షితం చేసుకోవచ్చు.ఆ రోజుల్లో ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు, ప్రభుత్వాలు స్థిరంగా పనిచేశాయి. అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. ఆర్థిక వనరులు సమర్థవంతంగా వినియోగించబడ్డాయి. ఇప్పుడు మనం ఆ విధానాన్ని తిరిగి తీసుకొస్తే, ఆ లాభాలను మళ్లీ పొందవచ్చు. ప్రజలు ఈ చరిత్రను తెలుసుకోవాలి. ఈ సంస్కరణ వారి జీవనోపాధిని ఎలా మెరుగుపరుస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. మన ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి ఒక స్పష్టమైన, దీర్ఘకాలిక దృష్టిని అందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో బిజెపి ఈ సంస్కరణను అమలు చేయడానికి అన్ని స్థాయిల్లో కృషి చేస్తోంది. ఇది కేవలం ఒక రాజకీయ ఎజెండా కాదు. ఇది భారతదేశ భవిష్యత్తును సురక్షితం చేసే ఒక గొప్ప సంకల్పం. మోదీ నాయకత్వంలో దేశం అనేక సంస్కరణలను చూసింది. జీఎస్టీ, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశాన్ని ముందుకు తీసుకెళ్లాయి. ఇప్పుడు 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కూడా అలాంటి ఒక సంస్కరణ.మోదీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తారు. ఈ సంస్కరణ ద్వారా ఆయన దేశ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, స్థిరమైన పరిపాలన, మరియు ఆర్థిక స్థిరత్వం అందించాలని కోరుకుంటున్నారు. బిజెపి ఈ లక్ష్యం కోసం కట్టుబడి ఉంది. ఖమ్మంలోని ప్రజలు ఈ దృష్టిని అర్థం చేసుకోవాలి. మీరు ఈ సంస్కరణకు మద్దతు ఇవ్వాలి. ఇది మీ భవిష్యత్తు కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం.కార్యకర్తలకు పిలుపుఇప్పుడు నా బిజెపి కార్యకర్తలకు ఒక పిలుపు. మీరు ఈ సంస్కరణ యొక్క రాయబారులు. ఈ సందేశాన్ని ఖమ్మంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి. ప్రజలకు ఈ సంస్కరణ యొక్క ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూసంపూడి రవీందర్ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు , గల్లా సత్యనారాయణ , గెంటాల విద్యాసాగర్ , మంద సరస్వతి, తుమ్మ శివ , భూక్య శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పని ఒత్తిడి, వేధింపులు ఉండవు

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**



ఖజానా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఉన్న పని ఒత్తిడి మరియు ఎస్టీఓల వేధింపుల పై ఆ శాఖ అధికారి డీడీ ఎస్ వీ ఎస్ నరసింహమ్‌తో మాట్లాడుతున్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాసరావు, ట్రెజరర్, వల్లపు వెంకన్న, అసోసియేట్ అధ్యక్షులు, దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు యత్రరమేష్, కరణ్ సింగ్, జాయింట్ సెక్రటరీ భూసా చంద్ర శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీ యర్రమల శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అస్లాం, రవిచంద్ర, కంచి శ్రీనివాస్, ప్రసన్న కుమార్, పృధ్వీ మరియు వైరా యూనిట్ అధ్యక్షులు ప్రవీణ్ తదితరులు. ఏప్రియల్ మొదటి నుండి అందరికి సమాన పనిభారం ఉండేలా ఆఫీస్ ఆర్డర్స్ తయారు చేస్తామని, టీఎన్జీఓ ఉద్యోగులపై వేధింపులు మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తామని డీడీ హామీ ఇచ్చారు.

## నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**



రఘునాథపాలెం మండలంలోని కోయచలకకు చెందిన నిరుపేద విద్యార్థిని పెనుగొండ సిరి చందన ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతుంది. వారి ఆర్థిక, కుటుంబ పరిస్థితి పరిశీలించి వారి అభ్యర్థన మేరకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక చేయూత అందించాలని నిర్ణయించి గురువారం నాడు 20వేల రూపాయల చెక్కును కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పినిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ట్రెజరర్ కనపర్తి వెంకటేశ్వర్లు, విద్యార్థిని తల్లి కవిత పాల్గొన్నారు.

# వ్యాపారవేత్త ఆలోచనా ధోరణితో మహిళలు ముందుకు సాగాలి





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

సమాజంలో సమానత్వం రావాలంటే మహిళలు అన్ని రంగాలలో నైపుణ్య వ్యాపారం చేస్తూ ఆర్థిక బలం సాధిస్తే సాధ్యమవుతుందని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం పెనుబల్లి మండలంలో కలెక్టర్ పర్యటించారు. పెనుబల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న మండల మహిళా సమాఖ్య భవనంలో ఉషోదయ, ఆదర్శ మహిళా సమాఖ్యలతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ప్రధాన ఎజెండా అంశాలు మహిళా అర్థిక పురోగతి, మహిళా శక్తి యూనిట్ల కార్యకలాపాలు, కొత్త గ్రూపుల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీలు, పొదుపు, కొత్త యూనిట్ల గ్రౌడింగ్, వ్యాపారంలో అభివృద్ధి పలు అంశాలపై సభ్యులతో కలెక్టర్ చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, వ్యాపార రంగంలో నిలదొక్కుకుని అర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటామని స్పష్టం చేశారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అనేక రకాల ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నదని, మహిళల అభివృద్ధి కోసం, ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం, ఉద్యోగ అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మహిళలకు ప్రోత్సహించడమే లక్ష్యంగా మహిళా శక్తి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు వ్యాపార నిర్వహణలో పంచసూత్రాలు పొదుపుపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. సరియైన సమమంలో పొదుపు, అప్పులు చెల్లింపు, వసూలు, పూర్తి బాధ్యతతో పుస్తక నమోదు పాటిస్తూ ధైర్యంగా ముందడుగు వేసి పదిమందికి ఆదర్శంగా ఉండాలన్నారు. మహిళల సమానత్వం మన ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లో ఆడపిల్లలను, మగ పిల్లలను సమానంగా చూడాలని, సమానంగా చదివించాలని సూచించారు. సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని వారిని అన్ని రంగాలలో పురోగమించేలా చేయడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు . మహిళలు అన్ని రంగాలలో పురోగమించడమే అసలైన అభివృద్ధి అన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని సూచించారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రతి రూపాయిని ఆదాయం పెంచే కార్యక్రమాలకు ఉపమోగించుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకొవాలని సూచించారు. జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే సూచనలు, అనుభవాలను పూర్తిస్థాయిలో సద్వి ని యోగం చేసుకోవాలని, మహిళలకు అవసరమైతే అదనపు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. అంతకుముందు కలెక్టర్, పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామంలో ఇందిర మహిళా శక్తి పథకంలో ఎస్.హెచ్.జి. ద్వారా లబ్ధిపొందిన యూనిట్లు బిస్మిల్లా చికెన్ సెంటర్, కూల్ డ్రింక్స్ షాప్, సాయిబాబా కిరాణం ఫాపులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. మహిళా శక్తి యూనిట్ల నిర్వహకురాలు ఫేక్ నాగుర్ బీ, మల్లెల సత్యశ్రీవాణి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వ్యాపారం ఎలా నడుస్తుంది.. ధైర్యంగా ఉన్నారు కదా.. కుటుంబానికి కొంత ఆసరా వచ్చిందా.. ఆర్థిక లావాదేవాలు సరిచూసుకుంటూ ఆదాయం పెంచే మార్గం పై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రయాణంలో సాఫీగా సాగాలంటే ఇంధనం సమకూర్చికొనే బండి డైవర్ మీరే అని.. ఇబ్బందులు ఏమైనా ఉంటే బండిని నెట్టడానికి అధికారులుగా మేము తోడుగా ఉంటామని సరదాగా ఛలోక్తులతో వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డీవో నూరొద్దీన్, అన్నపూర్ణ, లింగాల జ్యోతి, ప్రతాప్, రాధిక , రవీంద్రనాయక్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సహాయం చేయాలనుకున్న వారికి మంచి ప్లాట్ ఫాం

- వాల్ ఆఫ్ కైండ్ నెస్
- మీకు అవసరమైనది తీసుకోండి
- అవసరం లేనిది వదిలేయండి
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ ర్యాక్ లకు సేవా చేసే అవకాశంగా వాడుకుందాం
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- వాల్ ఆఫ్ కైండ్ నెస్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

మన ఇంట్లో మనకు అవసరం లేని వస్తువులు ఇతరులకు ఉపయోగ పడవచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఆసుపత్రి ఎదురుగా వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడను అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైన్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వాల్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమం క్రింద జిల్లా ప్రధాన ఆసుపత్రికి ఎదురుగా ఉన్న గోడ వద్ద ప్రజలు తమ ఇంట్లో అవసరం లేని వస్తువులు, పాత సామాన్లు, బట్టలు వదిలితే అవి అవసరం ఉన్నవారు తీసుకొని వెళ్తారని తెలిపారు. శుభ్రంగా ఉపయోగించదగిన, పాడైపోని దుస్తులు, బూట్లు, పుస్తకాలు, పాత్రలు, ఏదైనా ఇతర వస్తువులను వదిలి వేయాలని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ వద్ద ఎట్టి పరిస్థితుల్లో ఆహార పదార్థాలు వదిలివేయొద్దని కలెక్టర్ తెలిపారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ దగ్గర వస్తువులను వాటికి ఏర్పాటు చేసిన సెల్ఫ్ లలో ఉంచాలని, తద్వారా అవసరమైన వారు వాటిని సులభంగా కనుగొనవచ్చు అని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వస్తువులను నేలపై విసిరేయడం, వదిలేయడం వంటివి చేయవద్దని అన్నారు. దయచేసి మీకు అవసరమైనది తీసుకోండి అని, అవసరం లేనిది వదిలేయండి అనే నినాదంతో వాల్ ఆఫ్ కైండ్ నెస్ పని చేస్తుందని అన్నారు. దయ యొక్క గోడ వద్ద ఉన్న వస్తువులను ఎవరైనా వారి అవసరం మేరకు తీసుకొని వెళ్ళవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి ఒక మైలురాయి..

- **పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్.**
- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**వనం నాగయ్య, కెరటం న్యూస్**



రేపటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మం ది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## పరీక్షా సామాగ్రిని అందజేసిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్





**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

ఖమ్మం నగర పరిధిలోని బల్లేపల్లి ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ పరీక్షా సామాగ్రిని అందజేసింది. గురువారం నాడు బల్లేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాగం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరీక్షా సామాగ్రి అందజేసారు. ఖమ్మం జిల్లా విద్యారంగంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు అందిస్తున్న అందిస్తున్న ఆర్థిక చేయూత మరువలేనిదని, ప్రతి ఒక్కరు ఆచరించాలని ప్రధానోపాధ్యా యులు రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీరాజ్యం, రమేష్ బాబు, వై. లక్ష్మి, ఎన్. నిర్మల, బాబూసాహెబ్, వి. ప్రసాద్ విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గాజాలో హింసకు పూర్తి బాధ్యత అమెరికాదే

- **గాజాపై ఇజ్రాయిల్ మారణకాండకు సిపిఎం ఖండన**
- **పోతినేని, నున్నా**

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

గాజాపై ఇజ్రాయిల్ దాడులు మళ్ళీ చేయటంపైన సిపిఎం ఖమ్మం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిరచింది. గురువారం దాడులకు నిరసనగా నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం నుండి ప్రదర్శన బయలుదేరి ఎన్.ఎస్.పి. క్యాంప్‌లోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పాల్గొని మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడుల వలన 413 మంది పాలస్తీనీయులు మరణించారని, అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ మరోమారు గాజాపై మారణకాండకు తెగబడిరదని విమర్శించారు. రంజాన్ మాసంలో భీకర వైమానిక దాడులతో విరుచుకుపడి పాలస్తీనీయుల ప్రాణాలు హరించిందని అన్నారు. హమాస్ స్థావరాలే లక్ష్యంగా రాత్రి వేళల్లో విచక్షణారహితంగా భూతల, వైమానిక దాడులకు పాల్పడిరదని తెలిపారు. ఈ దాడుల్లో పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో మృతి చెందారని తెలిపారు. మృతిచెందినవారిలో సామాన్యులే




అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. ఇజ్రాయెల్‌కు పూర్తి నైతిక, ఆయుధ శక్తి సామర్థ్యాలను సమకూర్చి వెనుక నుండి ట్రంప్ ప్రభుత్వమే గాజాలో హింసా కాండకు కారణమైందని విమర్శించారు. అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్థిక, రాజకీయ మద్దతు ఇవ్వడం ద్వారా ఇజ్రాయిల్‌ను ఉసిగొల్పి గాజాను అమెరికా నాశనం చేసిందని విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యల వలన మరో విడత ఉద్రిక్తతలు మొదలయ్యాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్నారు. మేధావులు, అభ్యుదయకాముక శక్తులు, ఐక్యరాజ్యసమితి గాజాలో ప్రజలకు రక్షణగా నిలబడాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు వర్గాలు పాటించేలా చూడాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడుల ఫలితంగా మహిళలు, పిల్లలతో సహా 400 మందికి పైగా పాలస్తీనీయులు దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 నాటి నుండి పాలస్తీనీయుల మరణాల సంఖ్య 62 వేలు దాటిందని వీరిలో అత్యధికులు అమాయక పౌరులేనని విచారం వ్యక్తం చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను ఆపేలా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలని, తక్షణమే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడుల పట్ల భారత ప్రభుత్వం మౌనం పాటించడం సరైంది కాదని అన్నారు. భారత ప్రభుత్వం మౌనం వీడాలి, కొనసాగుతున్న హింసను ఖండిరచాలి. పాలస్తీనా ప్రజలకు సిపిఎం పార్టీ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాకమిటి సభ్యులు నందిపాటి మనోహర్, ఖమ్మం 1టౌన్ కార్యదర్శి నాగుల్‌మీరా, 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు ఆర్.ప్రకాష్, నర్రా రమేష్, ముదాం శ్రీను, చెరుకుమల్లి కుటుంబరావు, సదానందం, చింతల రమేష్, నామా లక్ష్మినారాయణ, పారుపల్లి కృష్ణారావు, దేవళ్ళ వీరబాబు, పాపారావు, యర్రా రంజిత్, హిమాం, శీలం వీరబాబు, లక్ష్మినారాయణ, నర్సింగరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరిని అభినందించిన కూసంపూడి

- **పార్టీ నలుదిశలా అభివృద్ధి చెందాలి**



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నెల్లూరి కోటేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూసంపూడి రవీందర్ గురువారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానం చేసి, పార్టీ పటిష్ఠత కోసం కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో నెల్లూరి కోటేశ్వరరావు ఓ వినయశీల నాయకుడిగా పేరుపొందారు. పార్టీ శ్రేణులను సమగ్రంగా సమన్వయపరచే శక్తి కలిగిన నేతగా ఆయన రాణిస్తున్న సంగతి తెలిసిందే. గతంలోనే ఆయన పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి, భాజపా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుండారు. ఇప్పుడు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, జిల్లాలో పార్టీని మరింత బలపడేలా తీర్చిదిద్దేందుకు నెల్లూరి ఉత్సాహంగా పనిచేయాలని కూసంపూడి సూచించారు.
కూసంపూడి రవీందర్ మాట్లాడుతూ, “భారతీయ జనతా పార్టీని జిల్లాలో మరింత విస్తరించేందుకు, ప్రతి గ్రామానికి చేరువ చేసే బాధ్యత ఇప్పుడు నెల్లూరిగారిదే. పార్టీ శ్రేణులను సంఘటితం చేసి, ప్రజలకు మోదీ పాలనలో వచ్చిన లబ్ధులను వివరించేలా కార్యాచరణ రూపొందించాలి” అని సూచించారు. “పార్టీని నలుదిశలా అభివృద్ధి చేయడానికి నాయకత్వం అత్యంత కీలకం. నాయకుడిగా నెల్లూరి జిల్లాలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లగల సత్తా కలవారు. కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేస్తే ఖమ్మంలో భాజపా మరింత బలపడే అవకాశం ఉంది” అని కూసంపూడి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా తరలివచ్చింది నాయకులు కార్యకర్తలు నెల్లూరు పోలీసులు ఘనంగా సన్మానించారు.

# ఉగాది నుంచి ఆడబిడ్డలకు సన్నబియ్యం

- **పెనుబల్లి మండలం పర్యటనలో మంత్రి పొంగులేటి**
- **రామ చంద్రపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన**
- **కల్లూరులోనూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పెనుబల్లి/కల్లూరు, కెరటం న్యూస్**

ఉగాది నుంచి ఆడబిడ్డలకు ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పెనుబల్లి మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి రామచంద్రపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం 15నెలలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ వ్యవధిలో మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చామని ఇందుకు గాను ఇప్పటి వరకు 5,450 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని పేర్కొన్నారు. రూ. 20,676కోట్ల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఏడాదిలోనే 56వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్



ప్రభుత్వానిది అన్నారు. రూ. 500కే గ్యాస్ అందించిన ఘనత తమదేనన్నారు. తాజాగా మూడు రోజుల క్రితం రాజీవ్ యువ వికాస్ అనే పేరుతో నూతన పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా ఒక్కో నియోజక వర్గంలో సుమారు 4000మందికి పైగా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు



ఉపాధి అవకాశం దొరుకుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 25లక్షల ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ. 7లక్షల కోట్లకు పైగా అప్పులకు ప్రతినెల రూ. 6500 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామని తెలిపారు. ఆ కారణంగానే కొన్ని హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. తల తాకట్టు పెట్టైనా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రాబోయే నాలుగేళ్లలో ఇరవై లక్షల ఇళ్లు పేదలకు ఇవ్వడం లక్ష్యమని తెలిపారు. తొలి విడతలో ఈ ఏడాది నాలుగున్నర లక్షల ఇళ్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుబంధు ఇచ్చామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500బోనస్ కూడా ఇచ్చామని తెలిపారు. ఇన్ని చేస్తున్నా ప్రతి పక్షాలు ఓర్వలేక తమ పై విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రామచంద్రపురంలో కొంతమంది రైతులు ఏళ్లుగా ప్రభుత్వ అటవీ భూమిని సాగుచేసు కుంటున్నారని వాటికి ప్రభుత్వం తరుపున చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టేకులపల్లి గ్రామంలో అవిరామ్ సర్వీస్ స్టేషన్ ను ప్రారంభించారు. స్థానికంగా ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా కల్లూరు మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి ఎర్రబోయినపల్లి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ లకు శంకుస్థాపన చేశారు. పెద్దకోరుకొండి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ తో పాటు అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి ప్రసంగించారు.

# సీపీఐ(ఎం) పోరాట ఫలితమే 'సీతారామ'

- ఎత్తిపోతల పథకంపై చిన్నచూపు
- బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు
- తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం
- బడ్జెట్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయం అన్నీ నిర్లక్ష్యమే..!
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.3.04 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా వాటిలో ఎంత మొత్తం ఖర్చు చేస్తారనేది సందేహాస్పదంగా ఉందన్నారు. క్రితంసారి రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా దానిలో ఖర్చు చేసింది రూ.2.38 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. ఈ రెండు మాసాలను కలిపి లెక్కలేస్తే రూ.2.66 లక్షల కోట్లకు చేరుకుంటామని ప్రభుత్వ అంచనాగా చెప్పారు. ఇంకా రూ.39వేల కోట్లు లోటు ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆదాయం వచ్చే పరిస్థితులు కూడా తగ్గాయన్నారు. రియల్‌ఎస్టేట్ తగ్గటం, ఆర్థికసంక్షోభం, వృద్ధి రేటు తగ్గటం, పంటల రేట్లు పడిపోవడం తదితర కారణాలతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గుతుందన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రవేశపెట్టారా? లేదా? అనే స్పష్టత లేకున్నా...ఈ జిల్లా మంత్రి ఆర్థికశాఖ మంత్రిగా ఉండి కూడా బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.643 కోట్లు కేటాయించటం అంటే...ముగ్గురు మంత్రులు ఏమి ఆలోచిస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఇలా బడ్జెట్ కేటాయించి ఎన్నేళ్లపాటు ఈ ఎత్తిపోతల పథకాన్ని కడతారని నిలదీశారు.

**సీపీఐ(ఎం) పోరాటాలతోనే 'సీతారామ'**

సీతారామ ప్రాజెక్టు దయాదాక్షిణ్యాలతో కాదు...పోరాటాలతో సాధించుకున్న ప్రాజెక్టు అని పోతినేని అన్నారు. 2002లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర నిర్వహించామని, అప్పటి టీడీపీ ప్రభుత్వం వ్యంగ్యంగా వ్యాఖ్యానించిందన్నారు. ఆ తర్వాత 2004లో




అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వద్ద సీపీఐ(ఎం) తరపున గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు పట్టుబడితే దుమ్ముగూడెం పేరుతో 2005 డిసెంబర్ 31న శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రోద్బలంతో దుమ్ముగూడేన్ని రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో రెండు భాగాలు చేశారని గుర్తు చేశారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకపోవడంతో ఖమ్మం నుంచి హైదరాబాద్ పాదయాత్ర మొదలు పెట్టామని, నకిరేకల్ వెళ్లేటప్పటికి రూ.2వేల కోట్ల అంచనాతో కూడిన దానికి వెంటనే రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లు నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కబురు చేయడంతో పాదయాత్ర నిలిపివేశామన్నారు. ఆ నాటి పాదయాత్రలో నాడు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గొన్నారని తెలిపారు. కానీ 2007 నుంచి 2012 దాకా తగిన నిధులు కేటాయించలేదన్నారు. 2012లో తన నాయకత్వంలో మళ్లీ పాదయాత్ర చేపట్టామన్నారు. ఈలోగా తెలంగాణ ప్రభుత్వం రావడంతో 2016 ఫిబ్రవరిలో రూ.7,900 కోట్ల అంచనాతో కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని, 2018 నాటికి రూ.13వేల కోట్లకు అంచనా వ్యయం పెరిగిందన్నారు. 2023కు వచ్చేనాటికి రూ.18వేల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు రూ.19,800 కోట్లకు పెంచుకుంటూ వచ్చారన్నారు. గతేడాది మోటార్ల ద్వారా నీళ్లిచ్చి ప్రాజెక్టు ప్రారంభించినట్లు ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం రూ.443 కోట్లు ఎత్తిపోతలకు, రూ.53 కోట్లు డిస్ట్రిబ్యూటరీలకు కేటాయించారని తెలిపారు. 72 పేజీల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేటాయించిన నాలుగు పేజీల్లో సీతారామ ప్రాజెక్టు ఊసే లేదన్నారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుతో డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు కింద మూడు లక్షలు నూతన ఆయకట్టు ఉందన్నారు. 3.50 లక్షల పాత ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారని తెలిపారు. నాగార్జునసాగర్, పాలేరు, వైరా, లంకాసాగర్ కింద ఉన్న భూములను స్థిరీకరిస్తామన్నారు. ఎండిపోయే భూములు భట్టి విక్రమార్క నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ సైతం సీతారామ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. ముగ్గురు మంత్రులుండి ఈ ప్రాజెక్టును ఇప్పుడు పూర్తి చేయకపోతే ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. రూ.19వేల కోట్ల అంచనా వ్యయంలో కేవలం రూ.8వేలు కోట్లు ఖర్చు పెడితే ఇంకా రూ.11,800 కోట్లు ఎప్పుడు వెచ్చిస్తారన్నారు. ఇలా రూ.600, రూ.700 కోట్లు కేటాయిస్తూ పోతే ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ముగ్గురు కీలక మంత్రులుండి అంచనాలు రివైజ్డవుతూ పోతే ఎప్పటికీ ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ప్రశ్నించారు. రూ.3లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టి రూ.600 కోట్లు సీతారామ ప్రాజెక్టుకు కేటాయించడమేంటని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం చేపట్టక తప్పని చర్యలను ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. ఈ బడ్జెట్ చర్చల్లో వచ్చే అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా ప్రజల నిరసనను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా బడ్జెట్**

వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉంటున్నాయని పోతినేని అన్నారు. కౌలు రైతులకు భరోసా లేదు..రుణమాఫీ ఇంకా పూర్తికాలేదన్నారు. ఇంకా 20 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే మాఫీ ఇచ్చారన్నారు. రూ.2 లక్షల పైబడిన రైతులకు మాఫీ చేయాలన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.16 లక్షలకు పైగా ఇండ్లు కేటాయించాల్సి ఉండగా బడ్జెట్‌లో రూ.12,500కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఈ నిధులతో 2.50 లక్షల ఇండ్లు మాత్రమే పూర్తవుతాయన్నారు. యూనివర్శిటీల భూములు అమ్ముతామనటం సిగ్గుచేటన్నారు. విద్యా, వైద్యం అన్నీ ఈ బడ్జెట్‌లో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ఓవైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వ్యవసాయానికి తగిన కేటాయింపులు లేవన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్,బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేసేదే.. ఫెడరేషన్

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

చిన్న సంఘం అని చిన్నచూపు చూసిన వారికి గుణపాఠం చెప్పే విధంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నిర్మాణాత్మకంగా బలోపేతమైందని, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, విశిష్ట అతిథి సీనియర్ జర్నలిస్ట్ కవి రచయిత బెల్లంకొండ ప్రసేన్ , ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ లు అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంచి కంటి భవన్లో జరిగిన సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడారు.. జర్నలిస్టుల సంక్షేమం కోసం కొన్ని యూనియన్లు సవతి తల్లి ప్రేమను చూపారని, వారి స్వలాభం కోసం, స్వప్రయోజనాల కోసం మాత్రమే పని చేస్తూ



జర్నలిస్టుల సంక్షేమాన్ని పక్కన పెట్టారని వారు విమర్శించారు.. భవిష్యత్తులో రెండు యూనియన్లు మాత్రమే ఉండబోతున్నాయని ప్రథమ స్థానంలో ఫెడరేషన్ వుంటుందన్నారు.. గతంలో ఫెడరేషన్ అంటే చిన్నచూపు చూస్తూ వివక్షకు గురి చేసిన నాయకుల నోళ్లే మూతపడ్డాయని ఎద్దేవా చేశారు.. అనేక యూనియన్లు గత కొన్ని దశాబ్దాలుగా సమాజంలో ఉన్నప్పటికీ నేటి వరకు జర్నలిస్టులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఫెడరేషన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ అనంతరం తీసుకున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాలు ఇన్నోవేటివ్ గా జర్నలిస్టులకు వరంగా మారాయని వారు ఉద్ఘాటించారు.. జర్నలిస్టులకు రేషన్ కార్డులు అంశంలో ఇప్పటివరకు ఏ యూనియన్ కూడా ఆలోచన కానీ, దృష్టి గాని పెట్టలేదని ఫెడరేషన్ ప్రత్యేక దృష్టితో సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రేషన్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేసిన ఘనత ఫెడరేషన్ దక్కిందని వారు గుర్తు చేశారు.

# సీనియారిటీ ప్రకారం డీఈఓలను నియమించండి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

ఖమ్మం జిల్లా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ని కలిసి త్వరలో ప్రభుత్వం తీసుకురాబోతున్న.. 104 ఉద్యోగులను డీఎంఈ పరిధిలో మెర్జ్ చేసే విషయంపై.. ఇక్కడ గల పోస్టులు ఖాళీల వివరాలు తీసుకోవడం జరిగింది. భవిష్యత్ లో జరగబోవు డీఈఓల నియామకాలలో యిప్పుడు 104 లో గత 17 సంవత్సరాల నుండి పని చేస్తున్న ఉద్యోగులను తీసుకోవాలని ప్రిన్సిపాల్ ని కలిసి అడగడం జరిగింది. దానికి ప్రిన్సిపాల్ సర్ సానుకూలంగా స్పందించినందుకు వారికి ధన్యవాదాలు.

# ఉప్పలపాటి సుబ్బారావు మృతి పట్ల నామ విచారం



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి సుబ్బారావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సుబ్బారావు కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించిన నామ ఆయన పార్టీ కోసం చేసిన కృషిని, తమ మధ్య ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. సుబ్బారావు నిబద్ధత నాయకుడని రాజకీయ ప్రస్థానం ప్రారంభం చేసిన తొలి నాళ్ల నుంచి తనతో పాటు పయనించారని, ఆయన సేవలు మరిచిపోలేనివని నామ తెలిపారు. సుబ్బారావు మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటుగా నామ పేర్కొన్నారు. సుబ్బారావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించిన నామ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎంపీ నామ ఆదేశాలు మేరకు క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు మోరంపూడి ప్రసాద్ రావు, నామ వ్యక్తిగత కార్యదర్శి జి నాగరాజు తదితరులు వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామం వెళ్లి సుబ్బారావు పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

# ధర్మ రక్షణ కోసం నిరంతర కృషి


- పనిచేసే వారికే పదవులు
- కాషాయ జెండా గడపగడపకు
- స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ నెల్లూరి కోటేశ్వరరావు, ధర్మ రక్షణ, ప్రజా శ్రేయస్సు, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీరామచంద్రుని సన్నిధిలో ప్రమాణం చేశారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన గౌరవప్రదమైన బాధ్యతలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, జిల్లాలో బీజేపీ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు.







**పనిచేసే వారికే పదవులు.**

పార్టీ సిద్ధాంతాల కోసం కష్టపడే కార్యకర్తలకు, నాయకులకే జిల్లా నాయకత్వం పదవులు, బాధ్యతలు కట్టబెడుతుందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. డాంబికంతో ఏమీ చేయకుండా నాయకత్వం ఆశించే వారు తమ శైలిని మార్చుకోవాలని హెచ్చరించిన ఆయన, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీలో మార్పు తప్పనిసరని ఉద్ఘాటించారు. "పనిచేసే వారికి గౌరవం ఇవ్వడంలో ఎటువంటి రాజీ ఉండదు. ఫలితాలు చూపించాల్సిన అవసరం ఇప్పుడు పార్టీకి ఎంతైనా ఉంది," అని ఆయన అన్నారు.

**కాషాయ జెండా గడపగడపకు.**

కాషాయ జెండాను చేతిలో పట్టుకోవడం కాదు, దాని ఆవశ్యకతను ప్రతి గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల గుండెలను తాకేలా ప్రచారం చేయాలని సూచించిన కోటేశ్వరరావు, ఇప్పటివరకు టైంపాస్‌తో కాలం గడిపిన వారు స్వభావం మార్చుకోవాలని, లేకుంటే ఇంటివద్దే ఉండాలని ఆదేశించారు. "ప్రతి కార్యకర్త జెండా ఉన్నతిని ప్రజలకు వివరించాలి. ఇకనుంచి అలసత్వానికి తావు లేదు," అని ఆయన హెచ్చరించారు.

**ప్రజల సమస్యలే పరిష్కారం.**

ప్రజల చిన్న కష్టంలోనూ కార్యకర్త అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారమే పార్టీ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. 24 గంటలూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చిన కోటేశ్వరరావు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. "ప్రజల ఆనందాలు, బాధలను పంచుకుంటేనే వారి విశ్వాసం సంపాదించగలం. అదే పార్టీ విజయానికి పునాది," అని ఆయన వివరించారు.

**స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యం.**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలాన్ని చాటేందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన నాయకులు, కార్యకర్తలను కోరారు. త్వరలో కార్యచరణ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పిన కోటేశ్వరరావు, ప్రతి క్షణం దేశ సేవకు అంకితం చేసి, ప్రజల విశ్వాసం చూరగొనాలని పిలుపునిచ్చారు. "సాంకేతికతను బలంగా వినియోగించుకుని, ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేయాలి. పార్టీ కుటుంబంగా ఐక్యంగా నడిస్తేనే విజయం సాధ్యం," అని ఆయన ఉద్ఘాటించారు.

**విమర్శలను స్వాగతిస్తూ.**

విమర్శలను స్వాగతించి, వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషించాలని కోటేశ్వరరావు సూచించారు. "విమర్శలు మన దృఢ నిశ్చయాన్ని పెంచుతాయి. ప్రతి నాయకుడు, కార్యకర్త దీన్ని గుర్తుంచుకోవాలి," అని ఆయన పేర్కొన్నారు. చివరగా, "మనం చరిత్ర సృష్టించే సామర్థ్యం ఉన్నవాళ్లం. ప్రజలపై నమ్మకంతో, సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో ముందుకు నడుద్దాం," అని ఆయన ఆహ్వానించారు.ప్రసంగం ముగింపులో ఆత్మీయ సమ్మేళనం త్వరలో నిర్వహిస్తామని చెప్పిన కోటేశ్వరరావు, "జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలతో సభను ముగించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసంపూడి రవీందర్, కొండపల్లి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

